

నృత్య నివేదన
శ్రీశైలంటెంపుల్: ధర్మపథం కార్యక్రమంలో భాగంగా శుక్రవారం నిత్యకళావేదికపై విశాఖపట్నానికి చెందిన విద్యార్థినులు ప్రదర్శించిన సంప్రదాయ నృత్యం భక్తులను అలరించింది.



చురుగ్గా విత్తనాల పంపిణీ
డోన్: ఉమ్మడి కర్నూలు జిల్లాలో సబ్సిడీపై వేరుశనగ విత్తనాల పంపిణీ కార్యక్రమం చురుగ్గా సాగుతోంది. 40 శాతం సబ్సిడీతో ప్రభుత్వం విత్తనాన్ని రైతులకు అందజేస్తోంది.



పుణ్యం పంచుతూ..
గోమాతను మొక్కితే ముక్కోటి దేవతల ఆశీర్వాదం లభిస్తుందని హిందువుల విశ్వాసం. ఇంతటి పుణ్యాన్ని ఇచ్చే ఆవుల పాలిట పట్టణాల్లోని ప్లాస్టిక్ వ్యర్థాలు శాపంగా మారుతున్నాయి. 8లో▸

న్యూస్‌రీల్

క్రీడా పాఠశాలలో ప్రవేశానికి ఎంపికలు
నంద్యాల(న్యూటౌన్): డాక్టర్ వైఎస్సార్ రాష్ట్ర క్రీడా పాఠశాలలో ప్రవేశానికి మండల, జిల్లా స్థాయి ఎంపికలు నిర్వహిస్తున్నట్లు జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ శిక్షకుడు రాజు శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. నాల్గో తరగతిలో 40 (బాలబాలికలకు) , 5వ తరగతిలో 11(ఏడు బాలురు, నలుగురు బాలికలకు) సీట్లు ఖాళీగా ఉన్నాయని తెలిపారు. ఎంపీడీఓ అధ్యక్షతన మండల స్థాయి కమిటీ ఆధ్వర్యంలో జూన్ 15 నుంచి 20వ తేదీలోపు విద్యార్థులకు శారీరక దారుఢ్య పరీక్షలు నిర్వహించి 8 పాయింట్స్, అంతకంటే ఎక్కువ సాధించిన వారిని జిల్లా స్థాయికి ఎంపిక చేస్తారని పేర్కొన్నారు. వీరికి నంద్యాలలోని స్పోర్ట్స్ కాంప్లెక్స్ ఇండోర్ స్టేడియంలో జూన్ 22 నుంచి 26వ తేదీ వరకు పలు పరీక్షలు నిర్వహించి రాష్ట్రస్థాయికి ఎంపిక చేస్తారన్నారు. గుంటూరులో ఆచార్య నాగార్జున యూనివర్సిటీలో ఈనెల 29 నుంచి 30వ తేదీ వరకు రాష్ట్రస్థాయి ఎంపిక పోటీలు ఉంటాయని తెలిపారు.

ముగిసిన 'పది' సప్లిమెంటరీ పరీక్షలు
నంద్యాల(న్యూటౌన్): పదో తరగతి సప్లిమెంటరీ పరీక్షలు శుక్రవారం ప్రశాంతంగా ముగిశాయి. నంద్యాల జిల్లా కేంద్రంలో 9 పరీక్ష కేంద్రాల్లో 17మంది విద్యార్థులకు గాను 14 మంది హాజరు కాగా, ముగ్గురు గైర్హాజరైనట్లు డీఈఓ అనురాధ తెలిపారు. ముగింపు రోజున సంస్కృతం పరీక్ష నిర్వహించారు.

అన్ని పాఠశాలలకు విద్యాకానుక కిట్లు



పుస్తకాలను పరిశీలిస్తున్న డీఈఓ అనురాధ

రుద్రవరం: అన్ని పాఠశాలలకు విద్యా కానుక కిట్లను చేర్చాలని ఎంఈఓ కోటయ్యను డీఈఓ అనురాధ ఆదేశించారు. రుద్రవరం జెడ్పీ ఉన్నత పాఠశాలలోని స్టాక్ పాయింట్‌గా శుక్రవారం ఆమె తనిఖీ చేశారు. మండలంలోని పాఠశాలల వివరాలు, విద్యార్థుల సంఖ్య, వచ్చిన పుస్తకాలు, యూనిఫాం, షూ, సాక్స్‌లు, బెల్టుల వివరాలు అడిగి తెలుసుకున్నారు. వాటిని త్వరగా అన్ని పాఠశాలలకు చేర్చాలని ఆదేశించారు. పాఠశాలలు పునఃప్రారంభమైన మొదటి రోజే విద్యార్థులకు జగనన్న విద్యా కానుకను అందించాల్సి ఉందన్నారు.

పోలీస్ సిబ్బంది సమస్యల పరిష్కారం కోసమే గ్రీవెన్స్‌డే



పోలీసుల సమస్యలు తెలుసుకుంటున్న ఎస్పీ రఘువీర్ రెడ్డి

బొమ్మలసత్రం: పోలీస్ శాఖలో పనిచేస్తున్న సిబ్బంది సమస్యల పరిష్కారం కోసం ప్రతి శుక్రవారం స్థానిక ఎస్పీ కార్యాలయంలో గ్రీవెన్స్‌డే నిర్వహిస్తున్నట్లు ఎస్పీ కె రఘువీర్‌రెడ్డి తెలిపారు. కార్యక్రమంలో భాగంగా శుక్రవారం పోలీసు సిబ్బంది నుంచి వినతులు స్వీకరించారు. కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ వెంకటరాముడు, సీసీ నాగరాజు పాల్గొన్నారు.

పసుపు రైతుకు కొమ్ముకాస్తూ!

రుద్రవరం సమీపంలో పసుపు కొమ్ములను గ్రేడింగ్ చేస్తున్న కూలీలు



అన్ని విషయాల్లో ప్రభుత్వం అండ



సుమారు 30 సంవత్సరాలుగా పసుపు సాగు చేస్తున్నాం. దిగుబడి కొనుగోలుకు ఏ ప్రభుత్వం ముందుకు రాలేదు. ఈ కారణంగా దళారులు చెప్పిందే ధరగా నడిచింది. గత రెండు సంత్సరాలుగా ప్రభుత్వమే ధర నిర్ణయించి కొనుగోలు చేస్తుండటంతో చాలా సంతోషంగా ఉంది. అన్ని విషయాల్లో ప్రభుత్వం అండగా నిలుస్తోంది.

– రామచంద్రుడు, రైతు, రెడ్డిపల్లె

సీఎం రుణం తీర్చుకోలేం



నేను 5 ఎకరాల్లో పసుపు పంట సాగు చేయగా సుమారు 100 క్వింటాళ్ల (ఎండు పసుపు) దిగుబడి వచ్చింది. దళారులు క్వింటా రూ.5 వేలకు మించి పోదని అడగటంతో దిక్కుతోచలేదు. ఈ ఏడాది పెట్టుబడైనా వస్తుందా అనుకుంటున్న సమయంలో ప్రభుత్వం రూ.6,850 మద్దతు ధర నిర్ణయించడంతో చాలా సంతోషం వేసింది. సీఎం వైఎస్ జగన్ రుణం తీర్చుకోలేం.

– లక్ష్మిరెడ్డి, రైతు, చిన్నవంగళి



పొలం వద్దే పసుపు నాణ్యతను పరిశీలిస్తున్న మార్క్‌ఫెడ్ జిల్లా మేనేజర్ నాగరాజు

ఆళ్లగడ్డ: పసుపు రైతులకు ప్రభుత్వం బాసటగా నిలిచింది. ప్రైవేటు మార్కెట్‌లో కనీస మద్దతు ధర కూడా లభించకపోవడంతో ప్రభుత్వం మార్కెట్ ఇంటర్‌వెన్షన్ స్కీమ్ కింద పసుపు కొనుగోలుకు ఉత్తర్వులు జారీ చేసింది. కనీస మద్దతు ధర క్వింటాకు రూ.6,850 ప్రకటించింది. ఈ ధర బహిరంగ మార్కెట్‌తో పోలిస్తే రూ.1,600 అధికం కావడం విశేషం. జిల్లాలో 2022–23 ఖరీఫ్ సీజన్‌లో 1,713 ఎకరాల్లో పసుపు సాగు చేయగా.. 57,281 క్వింటాళ్ల దిగుబడి వచ్చినట్లు అంచనా. మహానంది, నంద్యాల, ఆళ్లగడ్డ, చాగలమర్రి, రుద్రవరం తదితర మండలాల్లో పసుపు విస్తారంగా సాగైంది. ఒక్కో రైతు నుంచి 30 క్వింటాళ్ల వరకు కొనుగోలు చేయనున్నట్లు ప్రకటించారు. పసుపు కొనుగోలు వ్యవహారం పూర్తిగా వ్యవసాయ మార్కెట్ కమిటీలకే అప్పగించారు. ఉమ్మడి కర్నూలు జిల్లాలో ఆళ్లగడ్డ, నంద్యాలలోని ఏఎంసీలలో ఈ నెల 20 నుంచి పసుపు కొనుగోలుకు ఉత్తర్వులు వెలువడ్డాయి.

కనీసం 40వేల క్వింటాళ్ల కొనుగోలు లక్ష్యం

ఈ–పంట నమోదు ప్రామాణికంగా కనీసం 40,900 క్వింటాళ్ల పసుపు కొనుగోలు చేయాలని ప్రభుత్వం లక్ష్యంగా నిర్దేశించింది. ప్రస్తుతం రైతుల వద్ద ఏ మేరకు నిల్వలు ఉన్నాయో ఆర్బీకే సిబ్బంది ద్వారా సర్వే చేపట్టి అందుకు అనుగుణంగా ప్రభుత్వం మార్క్‌ఫెడ్‌కు ఆదేశాలు జారీ చేసింది. ఆర్బీకేల్లో ఈ–క్రాప్ నమోదు చేసుకున్న పసుపు రైతులు 1,713 మంది ఉండగా.. మార్క్‌ఫెడ్ ద్వారా పసుపు విక్రయానికి 1,121 మంది రైతులు తమ పేర్లు నమోదు చేసుకున్నారు. వీరి నుంచి మాత్రమే ఈనెల 30వ తేదీ వరకు పసుపు కొనుగోలు చేస్తారు. రైతుల కోసమే కొనుగోలు కేంద్రాలు ఏర్పాటయ్యాయని.. దళారులు, వ్యాపారులు జోక్యం చేసుకుంటే చర్యలు తప్పవని అధికారులు హెచ్చరించారు.

సంచులు, రవాణా ఖర్చులు మార్క్‌ఫెడ్‌కే సంబంధం

కళ్లాల్లో నుంచి కొనుగోలు కేంద్రానికి, అక్కడ తూకం వేసి లోడ్ చేసే వరకు రైతులదే బాధ్యత. అక్కడి నుంచి గోడౌన్‌కు తరలించే రవాణా ఖర్చులతో పాటు సంచుల ఖర్చు కూడా మార్క్‌ఫెడ్ చెల్లించేలా ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. జిల్లా పరిధిలో ఆళ్లగడ్డ, నంద్యాల, బండిఆత్మకూరులో గత సంవత్సరం నుంచి పసుపు కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేస్తుండగా.. ఈ ఏడాది అదనంగా మహానంది మండలం పరిధిలో పసుపు కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేశారు.

మార్క్‌ఫెడ్ ద్వారా కొనుగోళ్లు

- జిల్లాలో నాలుగు కొనుగోలు కేంద్రాల ఏర్పాటు
- మద్దతు ధర క్వింటా రూ.6,850
- విక్రయానికి ఆర్బీకేల్లో 772 మంది రైతుల పేర్లు నమోదు
- ఒక్కో రైతు నుంచి 30 క్వింటాళ్ల వరకు కొనుగోలు
- జిల్లాలో 40,900 క్వింటాళ్ల కొనుగోలు లక్ష్యం

మండలాల వారీగా పసుపు విక్రయానికి రైతుల పేర్ల నమోదు ఇలా..

మండలం	రైతుల సంఖ్య
ఆళ్లగడ్డ	29
బండిఆత్మకూరు	04
చాగలమర్రి	167
మహానంది	253
నందికొట్కూరు	05
నంద్యాల	75
పాములపాడు	77
పాణ్యం	07
రుద్రవరం	134
శిరివెళ్ల	12
వెలుగోడు	10

ఉండ ఒక్కటే తెస్తే కొనం



కష్టకాలంలో పసుపు రైతులకు అండగా నిలిచేందుకే ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసింది. రైతులు కొమ్ములు, ఉంటలు 2:1 నిష్పత్తిలో తీసుకురావాలి. వ్యర్థ పదార్థాలు, ఎండిన ఆకుమట్టలు, చెడిపోయిన, దెబ్బతిన్న కొమ్ములు నిబంధనల మేరకు మించకూడదు. కృత్రిమ రంగు లేని కొమ్ములను మాత్రమే కొనుగోలు చేస్తాం. పసుపు కొయ్యలు లేకుండా కేవలం ఉండ ఒక్కటి తీసుకొస్తే కొనుగోలు చేయం.

– నాగరాజు, జిల్లా మార్క్‌ఫెడ్ మేనేజర్

రైతులకు అండగా ప్రభుత్వం



వెంటనే పంటను అమ్ముకోవాలనే ఉత్సాహంతో రైతులు దళారులను నమ్మి మోసపోవద్దు. ప్రభుత్వం విత్తు నుంచి విక్రయం వరకు అన్ని విధాలా అండగా నిలుస్తోంది. జిల్లాలో పసుపు పంట విక్రయానికి ఆర్బీకేల్లో పేర్లు నమోదు చేసుకున్న రైతులు మద్దతు ధరతో అమ్ముకోవచ్చు.

– బి.వి.రమణ, జిల్లా ఉద్యాన శాఖ అధికారి



రుణ ప్రణాళికను ఆవిష్కరిస్తున్న కలెక్టర్ మనజీర్ జిలానీ శామూన్, బ్యాంకు అధికారులు

రూ.10,996 కోట్లతో రుణ ప్రణాళిక

నంద్యాల: జిల్లా అవసరాలకు అనుగుణంగా ఈ ఆర్థిక సంవత్సరానికి రూ.10,996.49 కోట్లతో రుణ ప్రణాళికను కలెక్టర్ మనజీర్ జిలానీ శామూన్ విడుదల చేశారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్‌లో బ్యాంకర్ల సమన్వయ సమావేశం నిర్వహించారు. ఆర్‌బీఐ ఏజీఎం మహమ్మద్ జైర్ రెహమాన్, నాబార్డ్ డీడీఎం సుబ్బారెడ్డి, యూబీఐ రీజినల్ హెడ్ పి.నరసింహారావు, డీఆర్‌డీఏ పీడీ శ్రీధర్‌రెడ్డి, ఎల్‌డీఎం రవీంద్రకుమార్ తదితరులు హాజరయ్యారు. ఈ సందర్భంగా రుణ ప్రణాళికను ఆవిష్కరించి కలెక్టర్ మాట్లాడారు. వ్యవసాయానికి, చిన్న, సూక్ష్మ, మధ్యతరహా పరిశ్రమలకు, గృహ నిర్మాణాలకు, ఇతర ప్రాధాన్యతా రంగాలకు లక్ష్యం మేరకు రుణాలందించాలన్నారు. పొదుపు మహిళలకు, రైతులకు, జగనన్న కాలనీల్లో గృహాలు నిర్మించుకునే లబ్ధిదారులకు, టిడ్కో గృహ లబ్ధిదారులకు విరివిగా రుణాలు ఇవ్వాలన్నారు. జిల్లా ఆర్థిక ప్రగతిలో భాగస్వాములు కావాలని బ్యాంకర్లను సూచించారు. వ్యవసాయం, అనుబంధ రంగాలు, చిన్న, సూక్ష్మ, మధ్యతరహా పరిశ్రమలు, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలు తదితర ప్రాధాన్యతా రంగాలకు రూ. 9,699 కోట్లు, ఇతర ప్రాధాన్యేతర రంగాలకు రూ. 1,297 కోట్లు లక్ష్యాన్ని కేటాయించినట్లు చెప్పారు.

అట్టడుగు వర్గాల ఆర్థికాభివృద్ధే లక్ష్యం

- వడ్డెరుల ఆత్మీయ సమావేశంలో రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి



మాట్లాడుతున్న ఆర్థిక శాఖ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి

డోన్: అట్టడుగు వర్గాల ఆర్థికాభివృద్ధే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం పనిచేస్తోందని రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి అన్నారు. పట్టణంలోని మధు ఫంక్షన్‌హాల్‌లో శుక్రవారం వడ్డెర కులస్తుల ఆత్మీయ సమావేశాన్ని ఆ సంఘం అధ్యక్షుడు వి. నాగరాజు అధ్యక్షతన నిర్వహించారు. ముఖ్య అతిథులుగా ఎమ్మెల్సీ ఏసురత్నం, పులివెందుల మునిసిపల్ చైర్మన్ వరప్రసాద్, రాష్ట్ర మీట్ కార్పొరేషన్ చైర్మన్ శ్రీరాములు హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో మంత్రి బుగ్గన మాట్లాడుతూ.. గతంలోని చంద్రబాబు పాలనకు నేడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనకు తేడాను ప్రజలు గమనించాలన్నారు. చంద్రబాబునాయుడు తన 14 ఏళ్ల పాలనలో రాష్ట్రంలో చేతి, కులవృత్తుల వారికి పనికిరాని పనిముట్లు అందజేసి బానిసలుగా మార్చేందుకు ప్రయత్నించారన్నారు. నేడు అనేక పథకాల ద్వారా వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అట్టడుగు వర్గాల వారికి ఆర్థిక సాయం అందజేస్తూ వారిని జీవన ప్రమాణాలను పెంచిందన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వడ్డెరులకు ప్రత్యేక ప్రాధాన్యతనిస్తున్నారని, ఎమ్మెల్సీగా ఏసురత్నాన్ని, ఎమ్మెల్యేగా జయమంగళ వెంకటరమణను గెలిపించారన్నారు. నామినేటెడ్ పోస్టుల్లో వడ్డెరులకు అవకాశం కల్పించారన్నారు. అంతేకాకుండా రాయల్టీలో రాయితీ సౌకర్యాన్ని ప్రభుత్వం కల్పిస్తోందని చెప్పారు. వడ్డెర కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి రూ.20లక్షలు మంజూరు చేస్తున్నట్లు మంత్రి బుగ్గన ప్రకటించారు. టీడీపీ నాయకులను వడ్డెరులు నిలదీయాలని ఎమ్మెల్సీ ఏసురత్నం, పులివెందుల మునిసిపల్ చైర్మన్ వరప్రసాద్ పిలుపునిచ్చారు. సమావేశంలో వడ్డెర సంఘం నాయకులు జరబంది రాజు, దేవేళ్ల వెంకట్, తస్నీరు సాంబయ్య, చక్రధర్, కోవెలకుంట్ల సుబ్బరాయుడు, బేతంచెర్ల సుబ్బరాయుడులు మాట్లాడారు. నాయకులు మద్దిలేటి, ఎల్లస్వామి, కొత్తకోట నాగరాజు, లక్ష్మినారాయణ, గోవిందు, మహరాజ్, తిమ్మాపురం సురేష్, ఎంపీపీ రేగటి రాజశేఖర్ రెడ్డి, జెడ్పీటీసీ సభ్యుడు బద్దల రాజ్‌కుమార్, మునిసిపల్ చైర్మన్ సప్తశైల రాజేష్, వైస్ చైర్మన్‌లు కోట్రికె హరికిషన్, జాకీర్ హుసేన్ తదితరులు పాల్గొన్నారు.



సమావేశానికి హాజరైన వడ్డెర కులస్తులు

తల్లికి పోషణ..బిడ్డకు రక్షణ

- సత్ఫలితాలిస్తున్న వైఎస్సార్ సంపూర్ణ పోషణ పథకం
- గర్భిణులు, బాలింతల ఆరోగ్యానికి భరోసా
- అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా ఆరు రకాల పౌష్టికాహారం పంపిణీ
- కిట్‌తో పాటు నాణ్యమైన భోజనం, గుడ్లు, పాలు అందజేత
- సేవల్లో అక్రమాలకు తావులేకుండా ప్రత్యేక యాప్‌లు

గర్భిణి, బాలింత సమయంలో తల్లి తీసుకునే పోషక ఆహారమే బిడ్డ ఆరోగ్యాన్ని నిర్దేశిస్తాయి. ఇదే ఉద్దేశంతో రాష్ట్ర ప్రభుత్వం వైఎస్సార్ సంపూర్ణ పోషణ పథకానికి శ్రీకారం చుట్టింది. అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా అమలు చేస్తున్న ఈ పథకం తల్లీ బిడ్డ ఆరోగ్యానికి భరోసా కల్పిస్తోంది.



లబ్ధిదారులకు వైఎస్సార్ సంపూర్ణ పోషణ కిట్లను అందజేస్తున్న దృశ్యం

కోవెలకుంట్ల: కోవెలకుంట్ల ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలోని ఆయా మండలాల్లో 180 అంగన్‌వాడీ, ఐదు మినీ కేంద్రాలు ఉన్నాయి. సున్నా నుంచి ఆరు నెలల్లోపు 1,319 మంది, ఆరు నెలల నుంచి సంవత్సరంలోపు 1,200 మంది, 1–3 సంవత్సరాల్లోపు 4,598 మంది, 3–6 సంవత్సరాల్లోపు 3,438 మంది చిన్నారులు, 1,401 మంది గర్భిణులు, 1,319 మంది బాలింతలు లబ్ధి పొందుతున్నారు. కేంద్రాల ద్వారా చిన్నారులకు ఆటపాటలతో విద్యాబోధన, చిన్నారులు, తల్లులకు ప్రతి రోజు మధ్యాహ్న భోజనం, కోడిగుడ్లు, బాలామృతం తదితర పౌష్టికాహారం అందజేస్తున్నారు. పోషక విలువలు తక్కువగా ఉన్న గర్భిణులు, బాలింతలు ఆరోగ్య సమస్యలు ఎదుర్కొంటున్నారు. దీనిని గమనించిన రాష్ట్ర ప్రభుత్వం వారికి మంచి పౌష్టికాహారం అందించేందుకు వైఎస్సార్ సంపూర్ణ పోషణ పథకాన్ని అమలు చేస్తోంది.

ఆరు రకాల పౌష్టికాహారం

గర్భిణులు, బాలింతల్లో రక్తహీనత, ఐరన్ లోప నివారణకు వైఎస్సార్ సంపూర్ణ పోషణ పథకం పకడ్బందీగా నిర్వహిస్తున్నారు. అంగన్‌వాడీ కేంద్రాల పరిధిలో గర్భిణీగా నమోదైనప్పటి నుంచి సుఖ ప్రసవానంతరం ఆరు నెలల పాటు వైఎస్సార్ సంపూర్ణ పోషణ పథకం ద్వారా ఆరు రకాల పౌష్టికాహారం అందజేస్తున్నారు. లబ్ధిదారులకు నెలకు సరిపడా కిలో రాగిపిండి, కిలో చిరుధాన్యాల పిండి, కిలో అటుకులు, పావుకిలో శనగ చిక్కీలు, పావుకిలో బెల్లం, పావుకిలో ఎండు ఖర్జూరాలతో కూడిన కిట్టును సరఫరా చేస్తున్నారు. కిట్‌తోపాటు గర్భిణులు, బాలింతలకు పోషక విలువలతో కూడిన నాణ్యమైన భోజనం, గుడ్లు, వారానికి సరిపడా లీటరు పాలు అందజేస్తున్నారు. వీటిని ఆహారంగా తీసుకోవడం ద్వారా రక్తం, ఐరన్ వృద్ధి చెంది తల్లి, బిడ్డ అనారోగ్య సమస్యల బారిన పడకుండా ఆరోగ్యకర జీవనం సాగిస్తున్నారు. నెలలో రెండు పర్యాయాలు అంగన్‌వాడీ కేంద్రాల్లో తల్లులు, చిన్నారులకు వైద్య పరీక్షలు నిర్వహించి కావాల్సిన మందులు సైతం అందజేస్తున్నారు.

అక్రమాలకు తావులేకుండా ప్రత్యేక యాప్‌లు

అంగన్‌వాడీ కేంద్రాల్లో స్మార్ట్‌ఫోన్ల వినియోగంతో పారదర్శకమైన సేవలు అందుతున్నాయి. ఆరు యాప్‌ల ద్వారా అన్ని రకాల సేవలు అందుబాటులోకి వచ్చాయి. చిన్నారులు, బాలింతలు, గర్భిణులకు అందించే మధ్యాహ్న భోజనంలో నాణ్యత లోపిస్తే హాట్ కుక్ యాప్‌లో వివరాలు నమోదవుతాయి. గ్రామ సచివాలయ మహిళా పోలీస్ అంగన్‌వాడీ కేంద్రాలను సందర్శించి మధ్యాహ్న భోజన పథకాన్ని తనిఖీ చేస్తారు. మెనూ ప్రకారం నాణ్యమైన భోజనం అందించని అంగన్‌వాడీ కేంద్రం వివరాలను యాప్‌లో నమోదు చేస్తారు. ఆ తర్వాత సంబంధిత అంగన్‌వాడీ కార్యకర్త, సూపర్‌వైజర్‌పై శాఖాపరమైన చర్యలు తీసుకుంటారు. అలాగే అంగన్‌వాడీ కేంద్రాల్లో తాగునీరు అందుబాటులో ఉంచాలి. లేని పక్షంలో యాప్‌లో వివరాలు నమోదు చేస్తే సమాచారం ఆర్‌డబ్ల్యూఎస్ శాఖ అధికారులకు చేరుతుంది. ఆ శాఖ అధికారులు యుద్ధ ప్రాతిపదికన నీటి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటారు. లబ్ధిదారులకు అందించే గుడ్ల సరఫరాకు ప్రత్యేక యాప్ అందుబాటులోకి వచ్చింది. ఆయా కేంద్రాలకు గుడ్ల ఏజెన్సీలు సక్రమంగా సరఫరా చేస్తున్నాయా, సైజు, నెలవారీ కోటా, స్టాంపింగ్, గుడ్ల నాణ్యత, తదితర వివరాలు నమోదు చేయాల్సి ఉంది. వైఎస్సార్ సంపూర్ణ పోషణ యాప్ ద్వారా లబ్ధిదారులకు అందించే పౌష్టికాహారం, చిన్నారుల ఎత్తు, బరువు, పిల్లల శారీరక, మానసిక అభివృద్ధి, తదితర వివరాలు పొందుపరుస్తున్నారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో ప్రత్యేక యాప్‌ల అమలుతో పౌష్టికాహార పంపిణీలో అక్రమాలకు పూర్తిస్థాయిలో చెక్ పడింది.

పకడ్బందీగా అమలు చేస్తున్నాం



కోవెలకుంట్ల మండలంలో 42 అంగన్‌వాడీ కేంద్రాలు ఉన్నాయి. ఆయా కేంద్రాల్లో చిన్నారులు, గర్భిణులు, బాలింతలకు పౌష్టికాహార పంపిణీని పకడ్బందీగా అమలు చేస్తున్నాం. అలాగే మాత, శిశు మరణాలను తగ్గించేందుకు ప్రభుత్వం చేపడుతున్న కార్యక్రమాలకు అవగాహన కల్పిస్తున్నాం.

– గీతాలక్ష్మి, ఐసీడీఎస్ సూపర్‌వైజర్, కోవెలకుంట్ల

అర్హులందరికీ అందజేస్తున్నాం



రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న వైఎస్సార్ సంపూర్ణ పోషణ పథక కిట్లను అంగన్‌వాడీ కేంద్రంలో అర్హులందరికీ అందజేస్తున్నాం. గర్భిణీగా నమోదైనప్పటి నుంచి ప్రసవ అనంతరం ఆరునెలల వరకు ప్రతి నెలా కిట్లను సరఫరా చేస్తున్నాం. గర్భిణులు, బాలింతలు పథకాన్ని సద్వినియోగం చేసుకుంటున్నారు.

–వెంకటలక్ష్మి,అంగన్‌వాడీ కార్యకర్త, కోవెలకుంట్ల

మహానందీశుడి హుండీ ఆదాయం రూ. 31.64 లక్షలు



కానుకల లెక్కింపును పరిశీలిస్తున్న ఈఓ

మహానంది: హుండీల్లో కానుకల లెక్కింపు ద్వారా మహానందీశ్వరస్వామికి రూ. 31,64,253 ఆదాయం లభించినట్లు ఈఓ కాపు చంద్రశేఖర్‌రెడ్డి తెలిపారు. స్థానిక అభిషేక మండపంలో శుక్రవారం హుండీల్లోని కానుకలను లెక్కించారు. హుండీల ద్వారా రూ. 31,07,168, అన్నప్రసాద విభాగం హుండీల ద్వారా రూ. 37,265, గోసంక్షరణ హుండీల ద్వారా రూ. 19,820 వచ్చినట్లు ఈఓ చెప్పారు. మొత్తం 31రోజులకు ఈ ఆదాయం వచ్చిందన్నారు. కార్యక్రమంలో ధర్మకర్త గంగిశెట్టి మల్లికార్జున, డివిజన్ ఇన్‌స్పెక్టర్ శశికుమార్, సూపరింటెండెంట్లు వెంకటేశ్వరుడు, శ్రీధర్‌బాబు, సిబ్బంది పాల్గొన్నారు.

క్లుప్తంగా

నేడు మరో విడత మొబైల్ రికవరీ మేళా

కర్నూలు: జిల్లా పోలీసు కార్యాలయంలో మరో విడత మొబైల్ రికవరీ మేళాకు అధికారులు ఏర్పాట్లు చేశారు. ఇప్పటికే బాధితులకు జిల్లా పోలీసు కార్యాలయ మైదానానికి రావాల్సిందిగా సమాచారం పంపారు. వారు పోగొట్టుకున్న సెల్‌ఫోన్లను శనివారం ఉదయం ఎస్పీ కృష్ణ కాంత్ చేతుల మీదుగా అందించనున్నారు. ఆరు మాసాల వ్యవధిలో రూ.16.05 కోట్లు విలువ చేసే సుమారు 7,154 మొబైళ్లను రికవరీ చేసి రాష్ట్రంలోనే కర్నూలు జిల్లా మొబైల్ రికవరీలో మొదటి స్థానంలో నిలిచింది. దేశంలోని ఒడిశా, ఉత్తరప్రదేశ్, కేరళ, మహారాష్ట్ర, తమిళనాడు, కర్ణాటక, బిహార్, రాజస్థాన్ తెలంగాణ, ఏపీ రాష్ట్రాల నుంచే కాకుండా సౌదీఅరేబియా నుంచి కూడా మొబైళ్లను రికవరీ చేసి బాధితులకు అప్పగించారు. మరో విడత సుమారు 600కు పైగా సెల్‌ఫోన్లను రికవరీ చేశారు. వాటిని జిల్లా పోలీసు పరేడ్ మైదానంలో నేడు ఎస్పీ కృష్ణకాంత్ చేతుల మీదుగా అందజేయనున్నారు.

కేసీ కెనాల్ డీఈఈగా వై.రఘురామిరెడ్డి



బాధ్యతలు స్వీకరిస్తున్న వై.రఘురామిరెడ్డి

కర్నూలు సిటీ: కర్నూలు–కడప కాలువ కర్నూలు సబ్ డివిజన్ డీఈఈగా వై.రఘురామిరెడ్డి బదిలీపై వచ్చారు. శుక్రవారం ఆయన జల మండలి ఆవరణలోని కేసీ కెనాల్ సబ్ డివిజన్ కార్యాలయంలో డీఈఈగా బాధ్యతలు చేపట్టారు. కార్యాలయం సిబ్బంది ఆయనకు బొకేలు అందజేసి స్వాగతం పలికారు. ఎస్‌ఆర్‌బీసీ సర్కిల్–1లో డీఈఈగా వై.రఘురామిరెడ్డి బాధ్యతలు నిర్వహించేవారు. జల వనరుల శాఖలో ఇటీవల నిర్వహించిన బదిలీల్లో కేసీ కెనాల్‌కి వచ్చారు. ఈయన మొదటగా 1993లో ఆధునికీకరణ విభాగంలో జేఈఈగా చేరారు. ఆ తరువాత 1998 నుంచి 2013 వరకు నాణ్యత విభాగంలో పని చేసి, 2013లో డీఈఈగా పదోన్నతి పొందారు. అప్పటి నుంచి 2019 వరకు చిన్ననీటిపారుదల శాఖ కర్నూలు సబ్ డివిజన్ డీఈఈగా పని చేసి, 2019లో ఎస్‌ఆర్‌బీసీకి బదిలీ అయ్యారు. అనంతరం ఎస్ఈ రెడ్డి శేఖర్ రెడ్డిని మర్యాద పూర్వకంగా కలిశారు.

వెబ్‌సైట్‌లో తాత్కాలిక సీనియార్టీ జాబితా

కర్నూలు సిటీ: కస్తూర్బాగాంధీ విద్యాలయాల్లో పనిచేస్తున్న వారి తాత్కాలిక సీనియార్టీ జాబితా rvmssakurnool. blogspot. in లో ఉంచినట్లు సమగ్ర శిక్ష అదనపు కో ఆర్డినేటర్ డాక్టర్ కే వేణుగోపాల్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఏమైనా అభ్యంతరాలు ఉంటే నేటి(శనివారం సాయంత్రం 5 గంటలలోపు)లోపు ఆధారాలతో తెలపాలని పేర్కొన్నారు. బదిలీలు పారదర్శకంగానే జరుగుతాయని, ఎలాంటి వదంతులు నమ్మవద్దని సూచించారు.



కదల్లేని స్థితిలో రోడ్డుపైనే కూలబడిన ఆవు

పుణ్యం పంచుతూ.. పాపం మోస్తూ!

ఆవు కడుపులో 60 కేజీల ప్లాస్టిక్

- కొన్ని నెలలుగా నరకయాతన
- నెలలు నిండకుండానే దూడ జననం
- ఐదు గంటల ఆపరేషన్‌తో ప్లాస్టిక్ వ్యర్థాలను తొలగించిన వైద్యులు
- ఇప్పటికీ వైద్యుల పర్యవేక్షణలోనే ఆవు

సాక్షి, కర్నూలు డెస్క్: ప్లాస్టిక్.. మానవాళి మనుగడకే ముప్పుగా పరిణమిస్తోంది. భూమిలో అంత సులువుగా కరిగిపోని ఈ మహమ్మారి వినియోగం మితి మీరుతోంది. ఏమి కొనుగోలు చేసినా మొదటగా అడిగేది కవర్ ఉందా అని.. దీని వల్ల నష్టాలు తెలిసినా, మనిషి జీవితంలో ఇది భాగమైపోయింది. ప్రభుత్వాలు వీటి వల్ల కలిగే పెను ముప్పును ఊహించి నిషేధించినా.. గుట్టుగా వినియోగం సాగుతూనే ఉంది. ప్లాస్టిక్ క్యాన్సర్ కారకమని వైద్యులు, శాస్త్రవేత్తలు నెత్తినోరు కొట్టుకుంటున్నా ప్రజలు మేల్కొని పరిస్థితి. ఇదిలా ఉంటే మూగజీవాలు కూడా వీటి బారిన చేయని తప్పుకు బలవుతున్నాయి. ఆవును సకల దేవతలకు నిలయంగా పూజిస్తాం. ఇంతటి పుణ్యాన్ని ఇచ్చే ఆవు.. మనిషి పెంచిపోషిస్తున్న ప్లాస్టిక్ భూతాన్ని ఆకలికి తాళలేక



దూడకు జన్మనిచ్చినా ఆహారం తినలేని స్థితిలో..

తింటూ మృత్యు ఒడి చేరుతున్నాయి. ప్లాస్టిక్ పాపాన్ని కడుపున మోస్తూ దినదిన గండంగా బతుకీడుస్తున్నాయి. నంద్యాల పట్టణంలో వందల సంఖ్యలో యజమానులు లేని ఆవులు వీధుల్లో తిరుగుతూ, దొరికింది తింటూ జీవనం సాగిస్తున్నాయి.

ఇక్కడే కాదు.. కర్నూలు, ఆదోని, ఎమ్మిగనూరు, డోన్ తదితర పట్టణాల్లోనూ రోడ్లపై వందల సంఖ్యలో గోవులు తిండికి అలమటిస్తున్నాయి. పల్లెల్లో తినేందుకు కాస్త ఆకులు, అలములు ఎక్కడపడితే అక్కడ దొరుకుతున్నా.. పట్టణాల్లో ఆ పరిస్థితి ఉండటం లేదని తెలిసిందే. కాంక్రీట్ వనాల్లాంటి ఇళ్లలో ప్రజలు ఎవరికి వారు గిరి గీసుకుని బతుకుతున్న రోజులివి. ఇలాంటి పరిస్థితుల్లో గోడలకు అతికించిన పేపర్లను తినడం, చెత్త కుండీలలో కనిపించిన ఆహారంతో కడుపునింపుకున్న ఆవులు.. ఇప్పుడు అదీ కనిపించక ఆకలితో అలమటిస్తున్నాయి.

కదల్లేని స్థితిలో ఆవు

నంద్యాల పట్టణంలో ఓ ఆవు గత కొంత కాలంగా నడిచేందుకు కూడా వీలులేని పరిస్థితిలో ఇబ్బంది పడుతోంది. వాస్తవానికి ఇది గర్భం దాల్చడంతో ఆ కారణంగానే ఇలా ఉందని అందరూ భావించారు. అయితే గత పది రోజులుగా కనీసం తిండి కూడా తినలేని పరిస్థితికి చేరుకుంది. ''మన ఊరు.. మన గుడి.. మన బాధ్యత'' బృందం సభ్యులు ఆవు దీనావస్థకు చలించిపోయారు. ఆ మూగజీవి బాధను అర్థం చేసుకొని తమ వంతుగా చికిత్సకు నడుంబిగించారు.

ఐదు గంటల పాటు శ్రమించి..

పశువైద్యులు ముందుగా ఆవుకు సర్జరీ చేయాలని భావించినా, ఆరోగ్యం సహకరించడం లేదని తెలిసి.. మూగజీవులను చేరదీస్తున్న చరణ్ సంరక్షణలో ఉంచారు. ఐదు రోజుల పాటు అవసరమైన మందులు ఇచ్చారు. అయితే సాధారణంగా తొమ్మిది నెలలు చూడి కాలం కాగా.. 8 నెలల్లోనే ఆవు దూడకు జన్మనిచ్చింది. నెలలు నిండకుండానే జన్మించిన ఈ దూడ కూడా బలహీనంగా ఉండటంతో వైద్యులు తగిన వైద్యం అందిస్తున్నారు. ఇక ఆవు కడుపులోని ప్లాస్టిక్ వ్యర్థాలను తొలగించేందుకు వైద్యులు గత గురువారం ఆపరేషన్‌కు సిద్ధమయ్యారు. ఉదయం 10.30 గంటలకు మొదలైన ఆపరేషన్ మధ్యాహ్నం 3.30 గంటల వరకు కొనసాగింది. నలుగురు వైద్యుల బృందం.. మూగప్రాణుల ప్రేమికులు చరణ్, రాఘవేంద్రతో పాటు మన ఊరు.. మన గుడి.. మన బాధ్యత బృందం సభ్యులు, గుంటూరు జిల్లా డిప్యూటీ చీఫ్ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్ శివకుమార్‌రెడ్డి తదితరుల సాయంతో ఎంతో కష్టించి ఆవు కడుపులోని ప్లాస్టిక్ వ్యర్థాలను తొలగించారు. ఇలా తొలగించిన వ్యర్థాల బరువు అక్షరాల 60 కిలోలు. మరో ఐదు రోజుల పాటు ఈ ఆవుకు మెరుగైన చికిత్సను అందించేందుకు వైద్యులు నిర్ణయించారు. ఇందుకు అవసరమైన 20 సెలైన్ బాటిళ్లను పట్టణానికి చెందిన ఓ మెడికల్ షాపు అందించడం విశేషం.



ఆవు కడుపు నుంచి తొలగించిన ప్లాస్టిక్ వ్యర్థాలు

ప్లాస్టిక్ కవర్లలోని వ్యర్థాలే ఆహారం

ఇంట్లో ఎలాంటి వ్యర్థమైనా సరే ప్లాస్టిక్ కవర్‌లో చుట్టిపారేయడం పరిపాటిగా మారింది. కుళ్లిన కూరగాయలు, మిగిలిపోయిన ఆహారం.. ఇలా ఏదైనా కవర్‌లోనే. మున్సిపాలిటీలు చెత్త సేకరణకు ప్రత్యేక చర్యలు చేపట్టినా, ఇంటిని శుభ్రంగా ఉంచుకునే యజమానులు.. ఊరు విషయంలో మాత్రం మనది కాదులే అనే ధోరణితో ఉంటున్నారు. ఎక్కడా గడ్డి దొరకని పరిస్థితుల్లో, ధాన్యం కూడా పెట్టేందుకు ఎవరూ ముందుకు రాని రోజుల్లో కవర్లలో చుట్టిపడేసిన వ్యర్థాలతోనే ఆవులు కడుపు నింపుకుంటున్నాయి. ఇలా కడుపులోకి చేరిన ప్లాస్టిక్ గోమాత ఉనికినే ప్రశ్నార్థకం చేస్తోంది.

1962 టోల్‌ఫ్రీకి కాల్ చేయగానే..

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం మూగజీవుల ప్రాణం కాపాడేందుకు గత ఏడాది ఏప్రిల్ నెలలో వైఎస్సార్ సంచార పశు ఆరోగ్య సేవా రథం సేవలను ప్రతిష్టాత్మకంగా అమలులోకి తీసుకొచ్చింది. స్థానికులు 1962 టోల్‌ఫ్రీ నెంబర్‌కు కాల్ చేయగానే 20 నిముషాల్లో అధునాతన సంచార పశు వైద్య వాహనం కోటవీధి బ్రహ్మణ బజారుకు చేరుకుంది. ఆవు పరిస్థితి ఆందోళనకరంగా ఉండటంతో వాహనంలోనే స్థానిక పశువుల ఆసుపత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు గర్భంతో ఉండటంతో పాటు పొట్టలో ప్లాస్టిక్ వ్యర్థాలున్న విషయాన్ని గుర్తించారు.



వాహనంలో పశువైద్యశాలకు తరలిస్తూ..



గణేష్ నగర్ సమీపంలో ఇదీ కేసీ కెనాల్ దుస్థితి



కర్నూలు రైతుబజార్ ప్రాంతంలో ప్లాస్టిక్ కవర్లను వినియోగిస్తున్న దృశ్యం

ప్లాస్టిక్ ముప్పు

కర్నూలు నగరం తెలియకుండానే ప్లాస్టిక్ మహమ్మారి గుప్పిట్లోకి వెళ్తోంది. ఎవరికి వారు మనకేం కాదులే అనుకోవడం ముప్పును తీసుకొస్తోంది. ప్రతీది ప్లాస్టిక్‌తో ముడిపడి, మనిషి జీవితంలో భాగమైపోవడంతో క్యాన్సర్‌కు దారితీస్తోంది. మట్టిలో కొన్నేళ్ల వరకు కలసిపోని స్వభావం కలిగిన ప్లాస్టిక్ కారణంగా వాతావరణం సైతం వేడెక్కుతోంది. ఎండలు అధికమయ్యాయని నిట్టూర్చే ప్రజలు కనీసం ఇక నుంచైనా ప్లాస్టిక్‌ను వదిలి ప్రత్యామ్నాయాలను ఎంచుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

– ఫొటోలు: డి.హుస్సేన్



జొహరాపురం వద్ద కవర్లను తింటున్న ఎద్దు



జొహరాపురం సమీపంలో ప్లాస్టిక్ వ్యర్థాలతో నిండిన కేసీ కెనాల్

ఫ్యామిలీ ఫిజీషియన్ పకడ్బందీగా నిర్వహించాలి



జూమ్ సమావేశంలో పాల్గొన్న వైద్య ఆరోగ్యశాఖ అధికారులు

కర్నూలు(హాస్పిటల్): ఫ్యామిలీ ఫిజీషియన్ కార్యక్రమాన్ని గ్రామాల్లో పకడ్బందీగా నిర్వహించాలని కుటుంబ సంక్షేమ శాఖ కమిషనర్ జె.నివాస్ చెప్పారు. శుక్రవారం ఆయన అమరావతి నుంచి జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారులతో జూమ్ కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి పీహెచ్‌సీలో 143 జీఓ ప్రకారం సిబ్బంది ఉండాలని ఆదేశించారు. ఫ్యామిలీ ఫిజీషియన్ కాన్సెప్ట్‌లో భాగంగా వైద్యులు, ఆరోగ్య సిబ్బంది వారికి కేటాయించిన గ్రామాలను సందర్శించి రెండు పూటలా వైద్యసేవలు అందించాలని చెప్పారు. వైద్యాధికారులు వారి పరిధిలోని హాస్టల్స్ సందర్శించి విద్యార్థినీ విద్యార్థులకు తగిన ఆరోగ్యసేవలు అందించాలన్నారు. గర్భిణులు, కిశోర బాలికలకు హిమోగ్లోబిన్ పరీక్షలు నిర్వహించి రక్తహీనత కలిగిన వారికి తగు చికిత్సలు అందించాలని, ఆ వివరాలను అనీమియా మానిటరింగ్ టూల్‌లో నమోదు చేయాలన్నారు. గర్భిణులను 12 వారాల్లోపు నమోదు చేసి ఆర్‌సీహెచ్ పోర్టల్‌లో వారికి ఇచ్చిన సేవలను నమోదు చేయాలని, ప్రమాదకర చిహ్నాలుంటే గుర్తించి కాన్పు తేదీకి మూడు రోజులు ముందుగానే ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి సంబంధిత ఫొటోను ఏఎన్‌ఎం యాప్‌లో పొందుపరచాలని ఆదేశించారు. ఎన్‌సీడీ సర్వే వీలైనంత త్వరగా వంద శాతం పూర్తి చేయాలన్నారు. సమావేశంలో డీఎంహెచ్‌ఓ డాక్టర్ బి. రామగిడ్డయ్య, డీఐఓ డాక్టర్ వై. ప్రవీణ్‌కుమార్, డీపీఎంఓ డాక్టర్ ఉమా, ఎఫ్‌పీసీ నోడల్ ఆఫీసర్ డాక్టర్ బాలమురళీకృష్ణ, కంటి వెలుగు నోడల్ అధికారి డాక్టర్ భరత్, ఏఓ డాక్టర్ నాగప్రసాద్, మలేరియా అధికారి నూకరాజు, ఎస్‌ఓ హేమసుందర్, డీపీఓ విజయరాజు, డెమో శ్రీనివాసులుశెట్టి పాల్గొన్నారు.

రాంగ్‌రూట్‌లో వెళ్తూ మృత్యుఒడికి..

- బైక్‌ను ఢీకొన్న మినీలారీ
- ఒకరు మృతి, మరొకరికి గాయాలు

పాణ్యం: బైక్‌పై రాంగ్‌రూట్‌లో వెళ్తూ ప్రమాదానికి గురైన ఘటనలో ఒకరు మృతిచెందగా మరొకరు గాయాలపాలయ్యారు. ఎస్ఐ సుధాకర్‌రెడ్డి తెలిపిన వివరాల మేరకు.. కర్నూలు జిల్లా దేవనకొండ మండలం చెల్లెల చెలిమిల్ల గ్రామానికి చెందిన బౌలు రంగస్వామి (36) మద్యానికి బానిసయ్యాడు. ఈ అలవాటు మానేందుకు పాణ్యంలోని శ్రీ సుంకులాపరమేశ్వరి ఆలయంలో పసరు తాపుతారు. ఈ విషయం తెలుసుకున్న తండ్రి బౌలు శంకర్ కుమారుడిని తీసుకుని పాణ్యంకు వచ్చారు. ఆలయం వద్ద పసరు తాపించుకుని తిరిగి బైక్‌పై స్వగ్రామానికి బయలుదేరారు. హైవేలో ఎస్సార్బీసీ ప్రధాన కాల్వ వద్ద రాంగ్‌రూట్‌లో వెళ్తున్నారు. అదే సమయంలో ఎదురుగా వస్తున్న మిని లారీ బైక్‌ను ఢీకొంది. ఈ ఘటనలో బైక్ నడుపుతున్న రంగస్వామి అక్కడికక్కడే మృతిచెందగా బౌలు శంకర్‌కు గాయాలయ్యాయి. స్థానికుల సమాచారంతో సంఘటనా స్థలానికి చేరుకున్న 108 సిబ్బంది క్షతగాత్రుడికి అక్కడే ప్రథమ చికిత్స అందించారు. కళ్లముందే కుమారుడు మృత్యుఒడికి చేరడంతో తండ్రి బోరున విలపించారు. మృతదేహాన్ని పోలీసులు పోస్టుమార్టం నిమిత్తం నంద్యాల ప్రభుత్వాసుపత్రికి తరలించారు. మృతుడికి భార్య గీత, ఇద్దరు కుమారులు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు.

ఐసీడీఎస్‌లో పదోన్నతులకు గ్రహణం!

- కౌన్సెలింగ్ నిర్వహణలో అధికారుల అలసత్వం

కర్నూలు(రాజ్‌విహార్): స్త్రీ, శిశు సంక్షేమ శాఖలో గ్రేడ్–1 సూపర్‌వైజర్ పదోన్నతులకు పట్టిన గ్రహణం వీడడం లేదు. తగిన సంఖ్యలో ఖాళీలు ఉన్నా.. భర్తీ చేయకుండా అధికారులు జాప్యం చేస్తున్నారు. ఐసీడీఎస్‌లో అంగన్‌వాడీ కార్యకర్తలుగా పనిచేస్తూ పదేళ్ల సర్వీసు పూర్తి చేసుకొని అర్హత ఉన్న వాళ్లకు 2012లో రాత పరీక్షల నిర్వహించి గ్రేడ్–2 సూపర్‌వైజర్లుగా పదోన్నతి కల్పించారు. ఇందులో రాయలసీమ జోన్ పరిధిలో 230కి మందికి పైగా అవకాశాలు వరించాయి. అప్పటి నుంచి పనిచేస్తున్న గ్రేడ్–2 సూపర్‌వైజర్లకు రాష్ట్ర ప్రభుత్వం గత ఏడాది పదోన్నతి కల్పించి గ్రేడ్–1 సూపర్‌వైజర్లుగా నియమించింది. అయితే అప్పట్లో ఉన్న ఖాళీ మేరకు 216 మందికి పైగా పదోన్నతి దక్కింది. ప్రస్తుతం 11 మంది ఏడాది నుంచి పదోన్నతుల కోసం కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నా కౌన్సెలింగ్ మాత్రం నిర్వహించడం లేదు. రెండు నెలల క్రితం ఉన్న ఖాళీల్లో వీళ్లకు పదోన్నతి కల్పించి గ్రేడ్–1 సూపర్‌వైజర్లుగా నియమించాలని నిర్ణయించుకున్న అధికారులు 11 మంది గ్రేడ్–2 సూపర్‌వైజర్ల సర్వీసు రికార్డులు ఆయా ప్రాజెక్టుల నుంచి తెప్పించుకున్నారు. కానీ కౌన్సెలింగ్ నిర్వహించకుండా జాప్యం చేశారు. ఈ లోపు రాష్ట్ర ప్రభుత్వం ఏపీపీఎస్‌సీ ద్వారా రాత పరీక్ష నిర్వహించి ఎంపిక చేసిన డైరెక్ట్ గ్రేడ్–1 అభ్యర్థులకు కౌన్సెలింగ్ నిర్వహించి పోస్టింగ్స్ ఇచ్చింది. ఇందులో రాయలసీమ జిల్లాలకు ఆరుగురిని కేటాయించారు. అయితే గ్రేడ్–2 నుంచి గ్రేడ్–1 సూపర్‌వైజర్లుగా పదోన్నతి ఇచ్చే ప్రక్రియ ఎక్కడికక్కడే నిలిచిపోయింది. ఎలాంటి కారణం లేకుండా అధికారులు జాప్యం చేస్తున్నారని, సకాలంలో కౌన్సెలింగ్ నిర్వహించకపోవడంతో ఏడాది సర్వీసు కోల్పోయారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సంబంధిత క్లర్కులు సెలవులో ఉన్న కారణంగా పదోన్నతుల కౌన్సెలింగ్ నిర్వహించడంలో జాప్యం జరుగుతోందని, వచ్చే వారం ప్రక్రియ నిర్వహిస్తామని స్త్రీ, శిశు సంక్షేమ శాఖ రీజినల్ జాయింట్ డైరెక్టర్ పద్మజ తెలిపారు.

దైవ దర్శనానికెళ్లి..

- కర్ణాటకలో రైలు ఢీకొని మహిళ మృతి



నాగలక్ష్మి (ఫైల్)

హొళగుంద: దైవ దర్శనం కోసం కర్ణాటకలోని ఉలిగి పుణ్య క్షేత్రానికి వెళ్లిన హొళగుంద మండలం గజ్జహళ్లి గ్రామానికి చెందిన బోయ కొత్తింటి నాగలక్ష్మి (23) రైలు ఢీకొని మృతిచెందారు. వివాహితురాలైన ఈమె గురువారం బంధువులతో కలిసి ఉలిగికి వెళ్లారు. రాత్రి ఆలయం వద్దే నిద్రించిన ఆమె శుక్రవారం తెల్లవారుజామున కాలకృత్యాలు తీర్చుకునేందుకు పక్కనున్న రైలు పట్టాలు దాటి వెళ్లారు. తిరిగి వచ్చే సమయంలో ఆ పట్టాలపై చీర కొంగు చిక్కుకుంది. తీసుకునేలోపు రైలు వచ్చి ఢీకొంది. ఈ ప్రమాదంలో నాగలక్ష్మి అక్కడికక్కడే మృతి చెందారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు. మృతురాలు నాగలక్ష్మికి భర్త బొజ్జయ్య, కుమారుడు, కూతురు ఉన్నారు.